## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 11-01-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- పరీక్షలు, ఇంటర్వ్యూల నిర్వహణలో పారదర్శకత, ప్రజల జవాబుదారీతనం నిష్పక్షపాతంగా ఉండేలా చూడాలని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ అభిప్రాయపడ్డారు.
- గత 10 సంవత్సరాల్లో మాదకద్రవ్యాల స్వాధీనం 7 రెట్లు పెరిగిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు.
- భారత్ ను మరోసారి విశ్వగురువుగా తీర్చిదిద్దగల సత్తా నేటి యువత కు ఉందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు.
- మహాకుంభ మేళా - 2025 సందర్భంగా 56 మంది ప్రత్యేక సైబర్ వారియర్స్, నిపుణులను సైబర్ పెట్రోలింగ్ కోసం నియమించారు.

==============================

పరీక్షలు, ఇంటర్వ్యూల నిర్వహణలో పారదర్శకత, ప్రజల జవాబుదారీతనం నిష్పక్షపాతంగా ఉండేలా చూడాలని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ అభిప్రాయపడ్డారు. ఈ రోజు బెంగళూరులో రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్ల 25వ జాతీయ సదస్సును ప్రారంభించిన అనంతరం ఉపరాష్ట్రపతి మాట్లాడారు. కార్యనిర్వాహక పలుకుబడి లేని, బంధుప్రీతి, పక్షపాతం నుంచి రక్షణ కల్పించే స్వతంత్ర కమిషన్ ను ఏర్పాటు చేయాలన్నది పూర్వ రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ దార్శనికత అన్నారు. నియామక పద్ధతుల్లో సమూల మార్పులు తీసుకురావాలని ఉపరాష్ట్రపతి పిలుపునిస్తూ..

(వాయిస్ 35 సెకన్లు)

==============================

అయోధ్యలో రామమందిర తొలి వార్షికోత్సవం 3 రోజుల వేడుకలు కన్నుల పండువగా ఈ రోజు మొదలయ్యాయి. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో

ముఖ్యమంత్రి మాట్లాడుతూ... 2014 నుంచి అయోధ్య నగరాభివృద్ధిని ప్రస్తావించారు. అయోధ్యకు ప్రతిరోజు లక్షా 50 వేల మంది నుండి 2 లక్షల మంది భక్తులు విచ్చేస్తున్నరన్నారు. 4, 6 లేన్ల రోడ్ల నిర్మాణం జరిగి, అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పడిందని, సరయూ నదీ ఘాట్‌లు యావద్దేశంలోని పర్యాటకులను ఆకర్షిస్తున్నాయని వివరించారు.

===============================

గత 10 సంవత్సరాల్లో మాదకద్రవ్యాల స్వాధీనం 7 రెట్లు పెరిగిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. న్యూఢిల్లీలో ఈ రోజు మాదకద్రవ్యాల అక్రమ రవాణా, జాతీయ భద్రతపై జరిగిన ప్రాంతీయ సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో మాదకద్రవ్యాలపై పోరాటం కొత్త బలాన్ని సంతరించుకుందని ఆయన అన్నారు. 2024లో 16 వేల 900 కోట్ల రూపాయలకు పైగా విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నామని అమిత్ షా పేర్కొంటూ..

(వాయిస్ 40 సెకన్లు)

===============================

సీడీఏసీ, నోవా డెవలప్ మెంట్ బోర్డు అభివృద్ధి చేసిన తేజ జేఏఎస్ 64 చిప్ ను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రారంభించారు. పుణెలోని సెంటర్ ఫర్ అడ్వాన్స్ డ్ కంప్యూటింగ్ డెవలప్ మెంట్ (సీడీసీ)ను ఆయన ఈ ఈరోజు సందర్శించారు. సూపర్ కంప్యూటర్ టెక్నాలజీ అభివృద్ధికి, పారిశ్రామిక సంస్థలకు ఉపయోగపడే ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తికి సంబంధించి జరుగుతున్న పనులను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్ కంపెనీలకు అవసరమైన చిప్స్, సెమీకండక్టర్లను అభివృద్ధి చేసేందుకు రంజన్ గావ్ లో ఎలక్ట్రానిక్ క్లస్టర్ ను ఏర్పాటు చేయనున్నమని తెలిపారు.

===============================

కామన్వెల్త్ దేశాల పార్లమెంట్ల స్పీకర్లు, ప్రిసైడింగ్ ఆఫీసర్ల 28వ సదస్సుకు 2026లో భారత్ ఆతిథ్యం ఇవ్వనుందని లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా సామాజిక మాధ్యమ వేదికగా ప్రకటించారు. కీలకమైన ప్రపంచ సమస్యలను పరిష్కరించడానికి అర్థవంతమైన చర్చలు, పరస్పర సహకార ప్రయత్నాలకు ఈ సదస్సు ప్రోత్సాహిస్తుందని పేర్కొన్నారు. పార్లమెంట్ల పనితీరులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సామాజిక మాధ్యమాలు ఉపయోగించడమనే అంశంపై ఈ సదస్సులో చర్చకు ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు.

విరామం

===============================

భారత సరిహద్దుల్లో బ్రహ్మపుత్ర నది పొడవునా తెప్పపై సాగే చారిత్రాత్మక యాత్రను అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ ఈటానగర్ లో జెండా ఊపి ప్రారంభించారు. నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ (నిమాస్) చేపట్టిన ఈ యాత్ర జనవరి 14న అరుణాచల్ ప్రదేశ్ లోని గెల్లింగ్ నుంచి ప్రారంభమై ఫిబ్రవరి 14న అసోంలోని ధుబ్రీ-హట్సింగిమారిలో ముగుస్తుంది. బ్రహ్మపుత్ర నదికి 916 కిలోమీటర్ల దూరం ప్రయాణించే మొదటి యాత్ర ఇదే కావడం విశేషం.

===============================

భారత్ ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో యువత కీలక పాత్ర పోషిస్తుందని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అన్నారు. ఈ రోజు మీరట్ లోని ఐఐఎంటీ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో రక్షణ మంత్రి ప్రసంగించారు. యువత విజ్ఞానం, నైపుణ్యాలు, సంకల్పంపైనే దేశ బలం లోతుగా పాతుకుపోయిందని అన్నారు. తమ

దృఢ సంకల్పబలంతో భారత్ ను మరోసారి విశ్వగురువుగా తీర్చిదిద్దగల సత్తా నేటి యువతకు ఉందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ..

(వాయిస్ 25 సెకన్లు)

================================

ఉత్తర్ ప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో జరుగుతున్న మహా కుంభమేళా 2025 ఈ సందర్భంగా సైబర్ బెదిరింపులను అరికట్టేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 56 మంది ప్రత్యేక సైబర్ వారియర్స్, నిపుణులను సైబర్ పెట్రోలింగ్ కోసం నియమించారు. మోసపూరిత వెబ్ సైట్లు, సోషల్ మీడియా మోసాలు, నకిలీ లింకులు వంటి సైబర్ బెదిరింపులను ఎదుర్కోవడానికి "మహాకుంభ్ సైబర్ పోలీస్ స్టేషన్"ను ఏర్పాటు చేశారు. సైబర్ ముప్పులపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా హెల్ప్ లైన్ నంబర్ 1920ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నిపుణుల బృందం సుమారు 50 అనుమానాస్పద వెబ్ సైట్లను గుర్తించి వాటిపై చర్యలు తీసుకుంటోంది.

================================

దేశ అభివృద్ధి ప్రయాణంలో యువతను భాగస్వామ్యం చేయడానికి "వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్" ఒక గొప్ప వేదిక అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. నేషనల్ యూత్ ఫెస్టివల్ 2025, వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్స్ పై కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ సహాయ మంత్రి రక్షా ఖడ్సే రాసిన వ్యాసాన్ని నరేంద్రమోదీ పంచుకుంటూ... ఈ విధంగా వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా రేపు న్యూఢిల్లీలోని భారత మండపంలో జరిగే "వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ 2025"లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొంటారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న 3 వేల మంది చురుకైన, క్రియాశీలకంగా ఉండే యువ నాయకులతో' నరేంద్రమోదీ ముఖాముఖిగా కలవనున్నారు.

================================

వచ్చే నెలలో జరగనున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సదస్సులో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫ్రాన్స్ లో పర్యటించనున్నరని ఆ దేశ అధ్యక్షులు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ప్రకటించారు. ఫ్రెంచ్ రాయబారుల సదస్సులో అధ్యక్షుడు మాక్రాన్ మాట్లాడుతూ... కృత్రిమ మేధస్సుపై అర్థవంతమైన చర్చలను పెంపొందించడానికి ఉద్దేశించిన రాబోయే ఏఐ శిఖరాగ్ర సమావేశాన్ని "కార్యాచరణ కోసం శిఖరాగ్ర సమావేశం"గా అభివర్ణించారు. ఫ్రాన్స్ పర్యటన ముగిసిన వెంటనే ప్రధానమంత్రి ఈ సదస్సులో పాల్గొంటారని అధ్యక్షులు మాక్రాన్ ధృవీకరించారు.

================================

ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. తొలిరోజైన ఈరోజు వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి తొమ్మిది మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లకు ఈ నెల 17వ తేదీ చివరి తేదీ. ఢిల్లీ అసెంబ్లీకి వచ్చే నెల 5న 70 స్థానాలకు ఎన్నికలు జరగనుండగా, ఫిబ్రవరి 8న ఓట్ల లెక్కింపు జరగనుంది.

================================
================================